నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్



## వైభవంగా మహా మండల పూజ

- సందడిగా అయ్యప్ప ఆలయం



భక్తులకు ఆశీర్వచనాలు అందిస్తూ..

దండేపల్లి, డిసెంబర్27 : గూడెం అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంలో బుధవారం మహా మండల పూజ మహోత్సవాన్నీ అత్యంత వైభవంగా నిర్వహించారు. గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో గురుస్వాములు దివ్యపదునెట్టాంబడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పద్దెనిమిది మెట్లను పూలతో అందంగా అలంకరించారు. అష్టోత్తర శతకలశాభిషేకం, మహాపడిపూజ, అభిషేకాలు, కుంకుమార్చనలు, స్వామి వారికి పుష్పాభిషేకం, పంచామృతాభిషేకాలునిర్వహించారు.స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వాములు ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. గురుస్వాముల మంత్రోచ్చారణాల మధ్య అయ్యప్ప శరణుఘోషతో ఆలయ ప్రాంతం మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గుట్ట ప్రాంతం సందడిగా మారింది.

## నేటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ..

- జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో 1,215 కౌంటర్ల ఏర్పాటు..

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రజా పాలన కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గురువారం నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించి అర్జీలను స్వీకరించనున్నారు. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 1,18,460 కుటుంబాల నుంచి అర్జీలను స్వీకరించేందుకు 1,215 కౌంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ అర్జీలను నేటి నుంచి స్వీకరించనున్నారు. గ్రామాల్లో కుటుంబాల సంఖ్యను బట్టి జనవరి 5వ తేదీ వరకు అర్జీలను స్వీకరిస్తారు. ఈ గ్రామ సభల్లో ప్రజలు నేరుగా దరఖాస్తులను సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఓటెత్తిన కార్మికులు

## సింగరేణిలో ముగిసిన 'గుర్తింపు' ఎన్నికలు

- మూడు ఏరియాల్లో 92 శాతానికి మించి పోలింగ్
- అర్ధరాత్రి వరకూ కొనసాగిన కౌంటింగ్
- ఆఖరి ఫలితం శ్రీరాంపూర్‌దే..

జిల్లాలోని మూడు ఏరియాల్లో పోలింగ్ శాతం...

| ఏరియా | పోలింగ్ శాతం |
|---|---|
| శ్రీరాంపూర్ | 93.0 |
| మందమర్రి | 96.3 |
| బెల్లంపల్లి | 93.4 |



రెబ్బెన : గోలేటి జీఎం సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న జీఎం కార్యాలయ క్లర్కులు



శ్రీరాంపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న కార్మికుడు



శ్రీరాంపూర్ : ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపిస్తున్న సింగరేణి కార్మికులు



శ్రీరాంపూర్ : ఓటు హక్కు వినియోగించుకుంటున్న కార్మికులు

మంచిర్యాల, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు ఓటెత్తారు. వాయిదాలు. కోర్టు తీర్పులు. తర్జన భర్జనల మధ్య ప్రశాంత వాతావరణంలో సింగరేణిలో ఏడో దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు బుధ వారం నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం కౌంటింగ్ సెంటర్లలో బ్యాలెట్ బాక్సులను తరలించారు. మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏరియాల్లో పోలింగ్ నిర్వహించారు. సింగరేణిలోనే అత్యధిక ఓటర్లు ఉన్న శ్రీరాంపూర్ ఏరియాలో 9,127 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 8,491 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీరాంపూర్ ఓసీలో అత్యధికంగా 96.4 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎస్సార్పీ 1 క్యాంటీన్‌లో 95.2 శాతం, ఎస్టీపీపీలో 95.3 శాతం పోలింగ్ నమోదైంది. బెల్లంపల్లి ఏరియాలో 996 మంది ఓటర్లకుగాను 959 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీపీఏ ఓసీ-2లో, ఖైరిగూడ, సీహెచ్‌పీల్లో 96 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. మందమర్రి ఏరియాలో 4,835 ఓటర్లకుగాను 4,515 మంది ఓట్లు పోలయ్యాయి. ఆర్కేపీ ఓసీపీలో 96 శాతం, ఎస్కే మైన్, కేకే 5, కమ్యూనిటీ హాల్ (పాత సీఐఎస్ఎఫ్ క్యాంపు) కేంద్రాల్లో 95 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచే కార్మికులు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి కనిపించారు. ఫస్ట్ షిఫ్టులో వచ్చిన వారు ఉదయం, సెకండ్ షిఫ్టులో వారు మధ్యాహ్నం, నైట్ షిఫ్టు డ్యూటీ చేసిన వారు ఉదయమే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

### కౌంటింగ్ ఆలస్యం..

రాత్రి 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. భోజనం చేసిన అనంతరం కౌంటింగ్ మొదలు పెట్టారు. అన్ని గనుల నుంచి వచ్చిన పోలింగ్ డబ్బాలను ఏజెంట్లకు చూపించాక సీల్ ఓపెన్ చేశారు. అనంతరం 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టారు. 13 యూనియన్లకు 13 డ్రమ్ములు పెట్టి వారికి వచ్చిన ఓట్లను అందులో వేశారు. అనంతరం కౌంటింగ్ చేశారు. అంతా ముగిసే సరికి అర్ధరాత్రి అయ్యింది. సింగరేణి వ్యాప్తంగా మొత్తం 11 ఏరియాల్లో ఇల్లందులో తొలి ఫలితం వచ్చింది.. 631 ఓట్లు మాత్రమే ఉన్న ఏరియా ఇది. అనంతరం బెల్లంపల్లి, కొత్తగూడెం, కార్పొరేట్ తరువాత అన్నింటికంటే చివరగా శ్రీరాంపూర్ ఫలితం వచ్చింది.



శ్రీరాంపూర్ : ఓటర్ ఐడీ చూపుతున్న సింగరేణి కార్మికులు




శ్రీరాంపూర్ : ఆర్కే-6 గని వద్ద టీబీజీకేఎస్ నాయకులు



మందమర్రిలోని పోలింగ్ బూత్‌లో క్యూలో నిల్చున్న యువతులు

## బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

- దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప



కొడ్ప విశ్వేశ్వర్‌ను పరామర్శిస్తున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నాయకులు

బెజ్జూర్, డిసెంబర్ 27 : మండంలోని సలుగుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొడ్ప విశ్వేశ్వర్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఏర్పాటు చేసిన దశదిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని పరామర్శించారు. విశ్వేశ్వర్ తండ్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిడాం సకారాం, బీఆర్ఎస్ నాయకులు డోకె వెంకన్న, రేణుకుంట్ల పెంటయ్య, జావీద్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీ సాధారణ సమావేశం

- హాజరైన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



సమావేశానికి హాజరైన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్, డిసెంబర్ 27: క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో 9 అంశాలతో కూడిన ఎజెండాను మున్సిపల్ మేనేజర్ నాగరాజు చదివి కౌన్సిల్ సభ్యులకు వివరించారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ 2 అంశాలను టేబుల్ ఎజెండా ప్రతిపాదించారు. మొత్తంగా 11 అంశాలకు సంబంధించిన ఎజెండా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, పెండింగ్, మిషన్ భగీరథ పనులు, జీవో 76 ద్వారా పట్టణంలో మిగిలిపోయిన ఇండ్ల పట్టాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి ముందు నూతనంగా ఎన్నికై మొదటి సారిగా మున్సిపల్ సమావేశానికి హాజరైన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కౌన్సిల్ సభ్యులు, కమీషనర్, కార్యాలయ సిబ్బంది, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి ఆరు గ్యారెంటీలు

- అర్హులందరికీ పంపిణీ చేస్తాం..
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నదని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి రాష్ట్రంలో ఆదర్శవంతమైన మార్పును తీసుకురావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సూచించారు. బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ప్రజాపాలన, ఆరు గ్యారెంటీల అమలుపై ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలను అర్హులందరికీ అందేలా చూడాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా పనిచేసి.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా పథకాలను అర్హులకు వర్తింప చేయాలని సూచించారు. నేటి(గురువారం) నుంచి జనవరి 6వ తేదీ వరకు మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేయాలని, దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని మంత్రి సూచించారు. గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేసిన హైమన్‌డార్ఫ్ వర్ధంతిని జనవరి 11వ తేదీన అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. విద్య, వైద్యం, సంక్షేమం, రవాణా రంగాలు మెరుగుపర్చడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. గిరిజనులకు పోష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి ప్రజాపాలన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, ఖానాపూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, గడ్డం వినోద్.. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జడ్పీ చైర్మన్‌లు రాథోడ్ జనార్దన్, విజయలక్ష్మీ, కృష్ణారావు.. మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఎస్పీలు ఉదయ్‌కుమార్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుడి ఆశీస్సులతో గూడెం ట్రయల్ రన్ సక్సెస్

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

దండేపల్లి, డిసెంబర్ 27: సత్యదేవుడి ఆశీస్సులు, కేసీఆర్ సర్కారు కృషితోనే గూడెం ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ సక్సెస్ అయ్యిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ రెండోసారి సక్సెస్ అయిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకంలో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కేసీఆర్ సర్కారు హయాంలో జీఆర్(గ్లాస్ రీఎన్‌ఫోర్స్‌డ్)పైపులైను తొలగించి ఎంఎస్(మైల్డ్ స్టీల్) పైపులను వేశామన్నారు. దీని ఫలితమే నేడు గూడెం ఎత్తిపోతల ఆయకట్టు రైతులకు యాసంగి పంటలకు నీరందే అవకాశం ఏర్పడిందన్నారు. గతేడాది రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్యను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించినట్లు గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మగూడెం వద్ద నిర్మిస్తున్న రాజీవ్‌సాగర్ నిర్మాణంలో వినియోగించిన ఎంఎస్ పైపులను గూడెం ఎత్తిపోతలకు వినియోగించడం వల్ల సమస్య పరిష్కారమైందన్నారు. దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### ప్రత్యేక పూజలు..

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 27: శివంకోటి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంచిర్యాల విశ్వనాథ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఉత్తర ద్వార దర్శనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శివంకోటి పూజ కార్యక్రమాన్ని కేవలం శ్రీశైలంలో, మంచిర్యాలలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత 57ఏండ్లుగా ఈ కార్యక్రమాన్ని ఇక్కడ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వనాథ ఆలయ కమిటీ అధ్యక్షుడు దొంతుల ముఖేష్, మాజీ అధ్యక్షుడు సిరిపురం శ్రీనివాస్, భక్తులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఆయువు తీసుకున్నారు..?

- ఉరేసుకొని తల్లీకూతుళ్ల ఆత్మహత్య



ఉరేసుకొని మృతి చెందిన ధనలక్ష్మి, జీవని(ఫైల్)

మందమర్రి, డిసెంబర్ 27: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో తల్లీకూతుళ్ల ఆత్మహత్య కలకలం రేపింది. తమిళనాడులోని చెన్నై సమీపంలో గల ఉస్లంబట్టి గ్రామానికి చెందిన మహేందర్ దేవర మురుగన్ నాలుగేళ్ల క్రితం కుటుంబంతో కలసి వచ్చి మందమర్రిలోని దీపక్ నగర్‌లో అద్దె ఇంటిలో ఉంటున్నారు. వ్యాపారం చేస్తూ జీవనం సాగించే మురుగన్ మంగళవారం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కాగా ఇంట్లో ఉన్న ఆయన భార్య ధనలక్ష్మి(36), కూతురు జీవని(16) మంగళవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఇంట్లోనే ఉన్న కుమారుడు సిద్ధార్థ నిద్రలో ఉండగా ఇదంతా గమనించలేదు. బుధవారం నిద్ర నుంచి లేచిన సిద్ధార్థ తల్లి, సోదరి ఉరేసుకొని కనిపించడంతో స్పృహ తప్పి పడిపోయాడు. కొంత సమయం తరువాత బంధువులకు సమాచారం ఇచ్చాడు. కాగా తాను పడుకునే సమయంలో తన తల్లి, సోదరి టీవీ చూస్తున్నారని, తెల్లారేసరికి ఇలా ఉరేసుకొని కనిపించారని చెబుతున్నాడు. ధనలక్ష్మి తల్లి కల్లమాయ మాత్రం ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన కూతురు, మనుమరాలు ఆత్మహత్య చేసుకొని ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మందమర్రి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్ఐ చంద్రకుమార్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన తరలించారు. అయితే ఇప్పటివరకు మురుగన్ ఆచూకీ లభించలేదు. ఆయన ఫోన్‌లో అందుబాటులో లేకపోవడంతో, ఆత్మహత్యకు కారణాలు పూర్తిస్థాయిలో తెలియరాలేదు.

## ఒకరికి కరోనా పాజిటివ్

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 27: మంచిర్యాల జిల్లాలో ఒక కరోనా కేసు నమోదైంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా 146 మందికి కరోనా (ర్యాపిడ్) నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్ వచ్చిందని వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఆ వ్యక్తికి ర్యాపిడ్ టెస్ట్‌లో మాత్రమే పాజిటివ్ వచ్చిందని మళ్లీ ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ చేసిన అనంతరం పాజిటివ్ వస్తే ఆ శాంపిల్ ను హైదరాబాద్ లోని జీనోమ్ సీక్వెన్స్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. దీంతో చాలా రోజుల తరువాత జిల్లాలో కరోనా పాజిటివ్ కేసు బయటపడడంతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా భయందోళనకు గురవుతున్నారు. కరోనా కేసులు పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటికే ప్రభుత్వ దవాఖానల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. కొవిడ్ సహాయం, ఇతర ఫిర్యాదులకు 7671001703 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.